Happy Work Anniversary. 1st Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152
P L. NO. IR/RNP/SV/26/2026

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 176
శుక్రవారం 03 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# వీబీజీ రామ్‌జీతో గ్రామాభివృద్ధి

(షణ్ముఖ వెలుగు, తిరుపతి,జూలై 02)

వీబీ జీరామ్‌జీ.. గ్రామాల ముఖచిత్రం మార్చే కార్యక్రమమని సీఎం చంద్రబాబు అన్నారు. దీనిపై ప్రధాని మోదీని అభినందించాలన్నారు. గతంలో ఉపాధి హామీని రాయలసీమ నుంచే ప్రారంభించారని గుర్తుచేశారు. ఇప్పుడు మెరుగైన సవరణలతో వీబీ జీరామ్‌జీని తీసుకొచ్చారని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ముక్కాలవారి పల్లెలో ఈ పథకానికి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్ర వాటా రూ.4 వేల కోట్లు కలిసి మొత్తం రూ.11వేల కోట్ల పైనే ఈ పథకానికి ఖర్చు పెడుతున్నామన్నారు. "ఈ పథకం కింద ఏ అభివృద్ధి పని అయినా చేసుకోవచ్చు. భూసార పరిరక్షణ, రహదారులు, డ్రైనేజీలు నిర్మించుకోవచ్చు. కొత్త ఆలోచనలు, విధానాలతో సమాజానికి మేలు చేసేలా కేంద్రం సంకల్పించింది. పనిని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం సంతోషించే విషయం. దొంగ లెక్కలు రాసుకోలేని విధంగా డిజిటల్ విధానం తీసుకొచ్చారు. పారదర్శకత కోసం రియల్‌టైమ్ మానిటరింగ్ ఉంటుంది" అని చంద్రబాబు తెలిపారు."గాలేరు-నగరి కాల్వ కోడూరుకు తీసుకొచ్చే బాధ్యత మాది. జలధార ద్వారా భూగర్భ జలాలను



**ఏపీలోని రైల్వే కోడూరు నుంచి దేశవ్యాప్తంగా వీబీ జీ రామ్ జీ పథకం ప్రారంభం**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో రూ.11,000 కోట్లతో గ్రామీణ అభివృద్ధి**

**రాష్ట్రంలో విధ్వంసమైన వ్యవస్థలను రెండేళ్లలోనే గాడిన పెట్టాం: సీఎం చంద్రబాబు**

**పోలవరం, అమరావతి నిర్మాణాలు ఆగవు.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం అన్ స్టాపబుల్ అని వ్యాఖ్య**

**రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని హామీ**

# 'ఉగ్రవాది ఉగ్రవాదే'.. ఐరాస వేదికగా గళమెత్తిన భారత్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 02)



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఎలాంటి రాజీ లేదని ఐరాస వేదికగా భారత్ పునరుద్ఘాటించింది. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని వెల్లడించింది. ప్రపంచ ఉగ్రవాద నిరోధక వ్యూహంపై ఐక్యరాజ్యసమితి తాజాగా జరిపిన సమీక్షలో భాగంగా భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. "ఉగ్రవాది ఉగ్రవాదే! ఉగ్రవాదాన్ని సమర్థించడానికి ఎలాంటి కారణాలు వెతకకుండా.. ఈ హంతక భావ జాలాన్ని సమూలంగా నిర్మూలించడానికి మనమంతా కలిసి కట్టుగా పనిచేయాలి" అని మనదేశం తరఫున హరీశ్ పిలుపునిచ్చారు. సీమాంతర ఉగ్రవాదం వల్ల భారత్ భారీగా నష్టపోతోందని, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని ▶మిగతా 2లో

# ఈ నెల 16 నుంచి 'తల్లికి వందనం' డబ్బులు జమ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)

రాష్ట్రంలో ఈ నెల 16, 17, 18న మెగా పీటీఎం సమావేశాలు నిర్వహించే సమయంలో 'తల్లికి వందనం' రెండో విడత డబ్బులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని ఐటీ, విద్యాశాఖ మంత్రి, తెదేపా



కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ తెలిపారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కొత్తపాళెం సమీపంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కూటమి విజయాలపై ఈనెల 15 నుంచి ఇంటింటా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. తెదేపా కార్యకర్తలకు స్వయం ఉపాధి కల్పించడానికి అవసరమైతే పార్టీ కొంత ఖర్చు భరిస్తుందన్నారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి చేరుకొని ముక్కంటిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని ▶మిగతా 2లో

# మోదీ చర్యలతో ఇంధన సంక్షోభ నివారణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)

పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడినా.. మోదీ ప్రభుత్వం భారత్‌పై ఆ ప్రభావం లేకుండా చూసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక వినియోగదారుడు రోజుకు కొనుగోలు చేసే పెట్రోల్‌పై ఉన్న గరిష్ఠ పరిమితిని ఎత్తివేయడం ద్వారా సాధారణ పరిస్థితులు వస్తాయని తెలిపారు. ఈ మేరకు దిల్లీలో ఒక ప్రకటన విడుదల చేశారు. 'కొరత రాకుండా ఉండేందుకు ఒక వ్యక్తి రోజుకు 200 లీటర్ల హై స్పీడ్ డీజిల్ (ఎచ్‌ఎస్‌డీ) మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన పెట్టాం. పరిశ్రమలకు, కమర్షియల్ వినియోగదారులకు కొనుగోలుపై ఆంక్షలు విధించాం. ఇప్పుడు పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో వీటిని తొలగించాం. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.183 తగ్గించడం ▶మిగతా 2లో



# అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తప్పవు: పవన్ కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)

వాక్ స్వాతంత్ర్యం అనేది అపరిమితమైన హక్కు కాదు. దానికి కొన్ని పరిమితులు ఉన్నాయి అని అన్నారు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. వాక్ స్వాతంత్ర్యం.. సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఒకరి హక్కులను మరొకరు ఉల్లంఘించే స్థాయికి వాక్ స్వాతంత్ర్యం వెళ్లినప్పుడు.. చట్టపరమైన చర్యలు తప్పవు అని పవన్ హెచ్చరించారు. సోషల్ మీడియా దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేలా ఏపీ డిప్యూటీ సీఎం ఆఫీసులో ఏర్పాట్లు చేయబోతున్నామని పవన్ చెప్పారు.

# అప్పులపై చర్చించేందుకు సిద్ధం.. ఇంకా బుకాయింపులు ఎందుకు?: మంత్రి జూపల్లి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)



బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వం రూ.7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.74వేల కోట్ల అప్పు చేసిందన్నారు. " నేను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా?మేం చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు. నా వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా.. చర్చకు రావాలి. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ▶మిగతా 2లో



# భారత్-పాక్ మధ్య చర్చలు జరపండి..

**ఇరు దేశాల ప్రధానులకు 117 మంది ప్రముఖుల లేఖ**

**భారత్-పాకిస్థాన్ మధ్య చర్చలు ప్రారంభించాలని ప్రముఖుల ఉమ్మడి లేఖ**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 02)

భారతదేశం, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించి, ఇరు దేశాల మధ్య చర్చల ప్రక్రియను పునఃప్రారంభించాలని కోరుతూ 117 మంది ప్రముఖులు ముందుకు వచ్చారు. భారత్, పాక్‌లకు చెందిన ఈ ప్రముఖులు ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లకు ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. దౌత్య మార్గాలను తిరిగి తెరిచి, సంప్రదింపులకు శ్రీకారం చుట్టాలని వారు తమ లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్' అధినేత ఓపీ షా ఈ విషయంపై మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవని, ఈ పరిస్థితి ఉపఖండంలోని సాధారణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ▶మిగతా 2లో



# సైన్యంలో ఇక 'బాజ్ బెటాలియన్'

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 02)

భవిష్యత్తు యుద్ధాల సన్నద్ధతలో భాగంగా డ్రోన్లు, మానవ రహిత వైమానిక వ్యవస్థల్ని నిర్వహించే ప్రత్యేక "బాజ్ బెటాలియన్"లను భారత సైన్యం సిద్ధం చేస్తోంది. డ్రోన్లు పోషించగల కీలక పాత్ర గురించి ఆపరేషన్ సిందూర్‌లో పాఠాలు నేర్చుకున్న నేపథ్యంలో ఈ కొత్త బెటాలియన్ రూపకల్పనకు పూనుకుంది. ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్ల అనివార్యతను ప్రభుత్వం గుర్తించింది. నిఘా సమాచార సేకరణ, కచ్చితత్వంతో కూడిన దాడులు తదితర యుద్ధ తంత్రాల్లో డ్రోన్లను వినియోగించనుంది. శత్రు భూభాగంలోకి బాజ్ బెటాలియన్ చొచ్చుకుపోయి సమాచారాన్ని సేకరించడంతోపాటు దీర్ఘకాలం సరిహద్దుల ▶మిగతా 2లో

# తప్పుడు పనుల కోసం నా వద్దకు రావొద్దు: అయ్యన్నపాత్రుడు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)



కార్యకర్తలు తప్పుడు పనులు చేస్తే తాను సమర్థించబోనని ఏపీ శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. వ్యక్తిగత సమస్యలు కాకుండా ప్రజా సమస్యలు తన దృష్టికి తేవాలన్నారు. రాజ్యసభ సభ్యుడిగా చింతకాయల విజయ్ ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి నర్సీపట్నం వచ్చిన నేపథ్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. "కొంతమంది వ్యక్తిగత పనుల కోసం నా వద్దకు వస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చింది ప్రజాసేవకే తప్ప, తప్పుడు వ్యక్తులకు సహకరించడం కోసం కాదు. అలాంటి చట్ట వ్యతిరేక పనులు నేను చేయను, చేయబోను" అని అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు.

# అమరావతిపై జగన్ మరో డ్రామా.. రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: సోమిరెడ్డి

**జగన్ వ్యాఖ్యలు గందరగోళంగా ఉన్నాయన్న సోమిరెడ్డి**

**రాజధానిపై కొత్త నినాదాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ**

**అమరావతిలో వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని వెల్లడి**

**రైతుల త్యాగాలను గౌరవించాలని జగన్‌కు సూచన**

**రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 02)

అమరావతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు 'మావిగన్' పేరుతో మరో కొత్త నినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు.
అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ▶మిగతా 2లో

## మొదటి పేజీ తరువాయి

# వీబీజీ రామ్‌జీతో గ్రామాభివృద్ధి

పెంచుకునేలా సంకల్పించాం. ఎంజీనరేగాలో కేంద్ర, రాష్ట్రాల వాటా 90-10గా ఉండేది. ఇప్పుడు రాష్ట్రం వాటా 40శాతం ఉంది. గడిచిన ప్రభుత్వ హయాంలో నిధులన్నీ దారిమళ్లించారు. ఇప్పుడు ఉపముఖ్యమంత్రి పవన్ నాయకత్వంలో గ్రామాల రూపురేఖలు మారుతాయి. ఒకే సారి గ్రామసభలు ఏర్పాటు చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పిన ఘనత పవన్‌ది. 2024 ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా 13,226 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించారు. వేల కి.మీ మేర సీసీ రోడ్లు, 40వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు నిర్మించారు. కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసిన ఘనత పవన్ కల్యాణ్‌ది" అని సీఎం ప్రశంసించారు.

**గొడ్డలి పార్టీతో జాగ్రత్త..** "రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ఉంది. దాంతో జాగ్రత్తగా ఉండాలి. అది రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికలకు ముందు అసెంబ్లీ సాక్షిగా అమరావతి అన్నారు. గతంలో మూడుముక్కలాట (మూడు రాజధానులను ఉద్దేశించి) ఆడారు. ఎన్నికలు అయిపోయాక మావిగన్ అంటున్నారు. మన రాజధాని అమరావతే.. అది దేవతల రాజధాని. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేస్తాం. విశాఖకు రైల్వే జోన్ సాధించాం. ఉత్తరాంధ్రకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం" అని చంద్రబాబు అన్నారు.

**గ్రామాలకే అధికారం: శివరాజ్ సింగ్**

పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా వీబీ జీరామ్‌జీ పథకం తీసుకొచ్చినట్లు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ తెలిపారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. " వీబీ జీరామ్‌జీ పథకం కింద రూ.7.5లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నాం. ప్రతి గ్రామానికి ఉపాధి కార్యక్రమాల కోసం రూ.2 కోట్లు అందజేస్తాం. చేసిన పనికి వేతనం ఆలస్యం కాకూడదనే మార్పులు చేశాం. కార్మికుడి కష్టానికి సరైన న్యాయం చేయాలని సంకల్పించాం. నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమవుతాయి. గ్రామాల వికాసానికి ఎన్డీయే ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఏ పనులు చేపట్టాలన్నా గ్రామాలకే అధికారం కల్పించాం. ఈ పథకం కింద ఏ పనులు చేయాలన్నా స్థానికంగానే నిర్ణయం తీసుకోవచ్చు" అని శివరాజ్ సింగ్ వెల్లడించారు.

**ఏపీకి అండగా ప్రధాని మోదీ: పవన్ కల్యాణ్**

ఏపీ గ్రామీణాభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని అన్నారు. " పేదరిక నిర్మూలనలో భాగంగా వికసిత్ భారత్ జీరామ్‌జీ తీసుకొచ్చాం. ఉపాధి శ్రామికులకు అదనంగా 25 రోజులు భరోసా కల్పించడం ముఖ్యమైంది. ఏపీలో ఈ కార్యక్రమం అమలు చేసేందుకు మొత్తం రూ.12,845 కోట్లు ఖర్చు చేయనున్నాం. గత రెండేళ్లలో పల్లె పండుగ వంటి కార్యక్రమాల కోసం రూ.16,695 కోట్ల ఉపాధి నిధులు వినియోగించాం. 7వేల కి.మీ సీసీ రోడ్లు, 15,500 పశువుల నీటితొట్టెలు నిర్మించాం. శ్రామికుల కొరత రాకుండా వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల విరామం రైతులకు ఉపయోగపడుతుంది" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# 'ఉగ్రవాది ఉగ్రవాదే'.. ఐరాస వేదికగా గళమెత్తిన భారత్

ఆయన పేర్కొన్నారు."సొంత ప్రజలకు కలిగిన ఈ వేదన భారతదేశ వైఖరిలో మార్పు తీసుకువచ్చింది. రాజకీయ కారణాలు, వ్యూహాత్మక లెక్కలతో సంబంధం లేకుండా ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో నిస్సందేహంగా ఖండించాలి. అంతర్జాతీయ సమాజం అంగీకరించిన ఫ్రేమ్‌వర్క్ లేకపోవడం వల్ల.. టెర్రరిజానికి వ్యతిరేకంగా కలిసికట్టుగా చర్యలు తీసుకోవడం వీలుకావడం లేదు. నియమనిబంధనల్లో ఈ లోపాలను సరిచేసేలా, ఉగ్రముఠాలకు నిధులు, ఆయుధాలు అందకుండా నిరోధించేలా చట్టాలు ఆవశ్యకం" అని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడి.. ఒక్కతాటిపైకి రావడానికి అవసరమైన రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించాలని సభ్యదేశాలను కోరారు. డ్రోన్లు, ఏఐ (ఆాతీఅటఅఎఋశ్రీ అత్వశ్రీశ్రీఅస్త్రవఅఎవ), డీప్‌ఫేక్, వర్చువల్ కరెన్సీలు, డార్క్‌వెబ్ వంటి సాంకేతికతలను ఉగ్రవాద సంస్థలు విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఉగ్రదాడులతో నేరుగా ప్రభావితమయ్యే బాధితులకు పునరావాసం కల్పించే ప్రయత్నాలపైనా అంతర్జాతీయ సమాజం దృష్టిసారించాలని కోరారు.

# ఈ నెల 16 నుంచి 'తల్లికి వందనం' డబ్బులు జమ

బొజ్జల సుధీర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. తర్వాత తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని శ్రీసిటీకి వెళ్తారు.

'కూటమి అధికారంలోకి వచ్చాక 150 రోజుల్లో 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. 6 వేల మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలిచ్చాం. ఈ ఏడాది 10 వేల పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. ఆగిపోయిన అమరావతి, పోలవరం పనులను పరుగెత్తిస్తున్నాం. గొడ్డలి పార్టీ అరాచకాలు, వేధింపులు, అహంకారం వంటి అవలక్షణాలు మనవాళ్లకు అంటకూడదు. అవి సోకితే నేనే వ్యాక్సిన్ వేస్తా' అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. తిరుపతి పార్లమెంటరీ కమిటీ పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, శాప్ ఛైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలి**

మంగళగిరి నియోజకవర్గం నిడమర్రులోని ప్రభుత్వ పాఠశాలలో చేరికలకు పోటీ నెలకొందని.. మిగతా సర్కారు బడుల్లోనూ నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు జస్మిత, సాయిపూజిత, మోహత్ చరణ్‌సాయిని అభినందించారు. వారి తల్లిదండ్రులను సన్మానించారు. విద్యార్థులకు శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాల పట్టాలు అందజేశారు.

# మోదీ చర్యలతో ఇంధన సంక్షోభ నివారణ

చిన్న హోటళ్లు నడిపే వారికి పెద్ద ఊరటనిచ్చింది. నాలుగు నెలలు హర్మూజ్ జలసంధి మూతపడినా.. ఎలాంటి ఇబ్బంది లేకుండా కేంద్రం చర్యలు తీసుకుంది' అని అన్నారు. ప్రజాహిత నిర్ణయాలు తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

# సైన్యంలో ఇక 'బాజ్ బెటాలియన్'

పర్యవేక్షణ, సైనిక లక్ష్యాల గుర్తింపులో పాలు పంచుకోనుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు ఇటీవలి పశ్చిమాసియా సంక్షోభంతో భవిష్యత్ యుద్ధాల్లో సైనికులు, సంప్రదాయ ఆయుధ సంపత్తికి దీటుగా డ్రోన్లు, తదితర మానవ రహిత వైమానిక సాధనాలకు ప్రాధాన్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది. ఈ డ్రోన్ బెటాలియన్లు సైన్యానికి మేధో కేంద్రంగా పనిచేస్తాయని విశ్రాంత మేజర్ జనరల్ ఏకే సివచ్ అన్నారు. ఇది సైనిక డ్రోన్ వ్యవస్థలన్నిటి పర్యవేక్షణనూ కేంద్రీకృతం చేస్తుందన్నారు. ఎంక్యూ-9బీ వంటి దీర్ఘశ్రేణి మానవ రహిత వాహకాలు అందించే సమాచారాన్ని కూడా బెటాలియన్లు విశ్లేషించి తగిన చర్యలు చేపడతాయని తెలిపారు. మానవరహిత యుద్ధ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతోపాటు భారత్ తన ఆకాశ మార్గాల రక్షణ కోసం "భార్గవాస్త్ర" వంటి డ్రోన్ వ్యతిరేక వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

# అప్పులపై చర్చించేందుకు సిద్ధం.. ఇంకా బుకాయింపులు ఎందుకు?: మంత్రి జూపల్లి

నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నాం" అని జూపల్లి అన్నారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని అన్నారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.

# అమరావతిపై జగన్ మరో డ్రామా.. రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: సోమిరెడ్డి

రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. అమరావతి కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి త్యాగాలు చేశారని సోమిరెడ్డి అన్నారు. ప్రస్తుతం రూ.57,821 కోట్ల విలువైన 97 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి కేవలం నగరం కాదని, ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష అని చెప్పారు. ప్రజల ఆస్తులు, రైతుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని జగన్‌ను హెచ్చరించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని సోమిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నారని చెప్పారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారని, ఇప్పుడు కొత్త నినాదాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# భారత్-పాక్ మధ్య చర్చలు జరపండి..

ఆందోళన వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య శాంతి, స్థిరత్వం, సాధారణ సంబంధాలు నెలకొంటేనే ప్రజల ఆర్థిక శ్రేయస్సు సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరు దేశాలను సంఘర్షణ వైపు నడిపించే ఏ చిన్న సంఘటన అయినా ప్రజల జీవనోపాధిని, అభివృద్ధిని దెబ్బతీస్తుందని ఆయన వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడుల (26/11 ముంబై, పుల్వామా, పహల్గామ్) గురించి ప్రశ్నించగా.. చర్చలు, సంప్రదింపులపై తనకు పూర్తి విశ్వాసం ఉందని షా బదులిచ్చారు. ఉగ్రవాదం, భద్రతాపరమైన ఆందోళనలతో సహా అన్ని క్లిష్టమైన సమస్యలను దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. చర్చలు నిరంతరాయంగా కొనసాగాలని, ఏ దశలోనూ ఇరు దేశాల మధ్య సంభాషణలు ఆగకూడదని ఆయన అభిప్రాయపడ్డారు.

'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాదంపై భారత్ కఠినంగా వ్యవహరిస్తున్న తీరుపై స్పందిస్తూ.. ఎంతటి కఠినమైన సమస్యలైనా చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని షా పునరుద్ఘాటించారు. భారత్, పాకిస్థాన్‌లలోని లక్షలాది మంది ప్రజలు శాంతినే కోరుకుంటున్నారని, తమ శాంతి పిలుపునకు మద్దతుగా వేలాది మంది సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. నిరంతర చర్చల వల్ల ఒకరి ఆందోళనలు, పరిమితులు మరొకరు అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీ వారి ఆస్థానం శ్రీగిరిలో శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)

శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురు వారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. గాయని బొల్లాపల్లి ఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలను మృదు మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ప్రతి ఆదివారం ఉదయం 9,30 గంటలకు శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్‌లో చిన్మయ మిషన్ తోడ్పాటుతో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులలో పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

# ఉత్తమ వైద్య సేవలకు లయన్స్ క్లబ్ వారి ఆత్మీయ సత్కారం






(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 2)

కంభం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దేశం గర్వించదగ్గ వైద్యులు డాక్టర్ బీసి రాయ్ జయంతి, వర్ధంతి సందర్భంగా జరుపు జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక వాసవి విద్యా సంస్థల ఆవరణలో ఘనంగా నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు గోళ్ళ సుబ్బరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంభం ప్రాంతంలో వైద్య సేవలందించుచున్న పలువురు వైద్యులను ఘనంగా సత్కరించడం జరిగింది. సన్మానం పొందిన వారిలో డాక్టర్ బిపి రంగనాయకులు, డాక్టర్ సయ్యద్ రసూల్, డాక్టర్ దశరథ్, డాక్టర్ తౌసిఫ్, డాక్టర్ ఆచారి, డాక్టర్ నజీర్ తదితరులు ఉన్నారు. వీరు మాట్లాడుతూ కంభం లయన్స్ క్లబ్ వారు మమ్మల్ని గుర్తించి ఈ కార్యక్రమంను నిర్వహించడం తమకెంతో సంతృప్తిని కలుగజేసిందన్నారు. డాక్టర్ బి పి రంగనాయకులు తన సందేశంలో డాక్టర్ బి సి రాయ్ ఈ దేశానికి చేసిన సేవలను వివరించి ఆయన యొక్క ఔన్నత్యాన్ని కొనియాడారు. వైద్య రంగం ఆయన స్ఫూర్తిగా సేవాలందించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోళ్ళ సుబ్బరత్నం మాట్లాడుతూ నేటి నుండి ప్రారంభం అయిన లయనిస్టిక్ సంవత్సరంలో అందరి సహకారంతో ప్రణాళికాబద్ధంగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మహబూబ్ బేగ్, కోశాధికారి నాగేశ్వరరావు, సీనియర్ సభ్యులు పార్శ శంకర్, జాకీర్ హుస్సేన్, డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్, బాల రంగారావు, సత్య రామారావు, మహబూబ్ బాషా, పేర్లి గుండయ్య, ఆలంపల్లి మురళీ కృష్ణ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

## ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 2)

విజయవాడ నుండి హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు ఇచ్చిన మాట ప్రకారం గురువారం హజ్ యాత్రికులకు ప్రత్యేక సబ్సిడీ రాయితీ పథకం ద్వారా 331 మందికి రూ.1 లక్ష రూపాయల చొప్పున నగదు బదిలీ చేశారని ఒంగోలు పార్లమెంటు ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోటులో ఉన్నసరే అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ అలాగే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలని ఆయన చేస్తున్న కృషికి ముస్లిం సోదరులు రుణపడి ఉంటారని రాష్ట్ర ముస్లిం సోదరుల తరుపున హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా అని పేర్కొన్నారు.

# జీజీహెచ్ అరుదైన నరాల వ్యాధులకు విజయవంతమైన చికిత్స

## కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.5 నుంచి రూ.10 లక్షలు ఖర్చయ్యే వైద్యం ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 2)

ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్) ఒంగోలులోని న్యూరాలజీ విభాగం మరోసారి అరుదైన నరాల వ్యాధులతో బాధపడుతున్న ముగ్గురు రోగులకు విజయవంతంగా చికిత్స అందించింది. న్యూరాలజిస్ట్ డాక్టర్ హరి ఆధ్వర్యంలోని వైద్య బృందం ఈ క్లిష్టమైన కేసులను సమర్థంగా నిర్వహించింది. సింగరాయకొండకు చెందిన షౌకత్ అలీ కార్టికోబేసల్ సిండ్రోమ్ అనే అరుదైన నరాల వ్యాధితో ఆసుపత్రిలో చేరారు. ఈ వ్యాధి వల్ల చేతులు, కాళ్లు సరిగా పనిచేయకపోవడం, శరీరం బిగుసుకుపోవడం, నడవడంలో ఇబ్బంది, రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా మారుతుంది. రోగికి అవసరమైన పరీక్షలు చేసి, మందులు, ఫిజియోథెరపీ, పునరావాస చికిత్స అందించి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచారు. అలాగే మేదరమెట్లకు చెందిన 28 సంవత్సరాల కల్పన, ఒంగోలుకు చెందిన 50 సంవత్సరాల శైలజ ఎన్ఎంఓ లేదా డెవిక్స్ డిసీజ్ అనే తీవ్రమైన నరాల వ్యాధితో చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చారు. శైలజకు ఈ వ్యాధి మూడోసారి తిరిగి వచ్చింది. ఈ వ్యాధిలో శరీర రోగనిరోధక శక్తి పొరపాటున వెన్నుపాము, కంటి నరాలపై దాడి చేస్తుంది. దీంతో చేతులు, కాళ్లు బలహీనపడటం లేదా కదలకపోవడం, చూపు తగ్గడం, మూత్ర విసర్జనలో ఇబ్బందులు వంటి సమస్యలు వస్తాయి. రోగుల పరిస్థితిని గుర్తించిన డాక్టర్ హరి బృందం వెంటనే హై డోస్ స్టెరాయిడ్ చికిత్స ప్రారంభించింది. అనంతరం ప్లాస్మా ఎక్స్‌ఛేంజ్, ద్వారా రక్తంలో ఉన్న హానికర యాంటీబాడీలను తొలగించారు. అలాగే ఐవీఐజీ ,రిటుక్సిమ్యాబ్ వంటి అత్యాధునిక మందులతో చికిత్స అందించారు. ప్రస్తుతం ఇద్దరు రోగులు కోలుకుంటున్నారు. ఈ తరహా చికిత్సలు ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేయించుకుంటే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని, అయితే జీజీహెచ్ ఒంగోలులో ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా ఈ వైద్య సేవలను అందిస్తోందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను బలోపేతం చేయడంతో జిల్లా ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందుతోందన్నారు. ఖరీదైన చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒంగోలులోనే నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. డాక్టర్ హరి ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, ఏఆర్ఎంఓ డాక్టర్ సునీల్ గవాస్కర్, తదితరులు పాల్గొన్నారు.





ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
03.07.26 శుక్రవారం


# మారీచుడు వేషం మార్చినట్టు రాజధాని పై జగన్ మాట మారుస్తున్నారు

- మానసిక పరిపక్వత లేని పిచ్చోడిలా జగన్ మాట్లాడుతున్నారు
- అమరావతి రాజధానిగా పార్లమెంటు ఆమోదించింది
- కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది
- ఇప్పుడు మావిగన్ అంటూ
- జగన్ ఎవరిని మభ్య పెట్టడానికి
- జగన్ ఎజెండా మోసం, ఆచరణ వంచించడం
- మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 2)
మారీచుడు వేషం మార్చినట్టు రాజధాని పై జగన్ మాట మారుస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. గురువారం ఒంగోలులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ మానసిక పరిపక్వత లేని పిచ్చోడిలా జగన్ మాట్లాడుతున్నారు. అమరావతి రాజధానిగా పార్లమెంటు ఆమోదించింది, కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పుడు మావిగన్ అంటూ జగన్ ఎవరిని మభ్య పెట్టడానికి? జగన్ ఎజెండా మోసం, ఆచరణ వంచించడం. నాడు మూడు రాజధానులు అన్నాడు, మొన్న అమరావతి రైతుల పరిరక్షణ కమిటీ అన్నాడు, మళ్లీ మావిగన్ అంటున్నాడు. పిచ్చోడిలా మాట్లాడుతున్న జగన్ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. జగన్ వ్యాఖ్యలు చూసి చిన్నపిల్లలు సైతం నవ్వుకుంటున్నారని మంత్రి స్వామి అన్నారు.

# "డ్వామా" మజాకా...!

- ▶సస్పెండ్ అయిన వారికి అదే స్థానంలో తిరిగి పోస్టింగ్
- ▶ఇదీ ప్రకాశం జిల్లా డ్వామా ఉన్నతాధికారుల తీరు
- ▶రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పొదిలి ఏపిఓ, మార్కాపురం ఈసీ తిరిగి నియామకం
- ▶రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైన విబిజీ రామ్ జీ కార్యక్రమం
- ▶మీడియాలో ఏపిఓకు నచ్చిన వారికే సమాచారం...
- ▶సస్పెండ్ అయినా తీరు మారని ఏపిఓ మహాలక్ష్మి


ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
(ఫైల్ ఫోటో)
ఈసీ బెల్లంకొండ కిషోర్ సస్పెండ్
(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 27)
ఉపాధి హామీ పథకంలో ఈసీగా విధులు నిర్వర్తిస్తున్న బెల్లంకొండ కిషోర్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ పి డి జోసెఫ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే అర్ధవీడు మండలంలో విధులు నిర్వహించిన సమయంలో లేని మొక్కలను ఉన్నవిగా చూపిస్తూ లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డాడని ఫిర్యాదులు అందాయి. ఆ ఫిర్యాదుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పిడి జోసెఫ్ కుమార్ పూర్తి స్థాయి విచారణ చేపట్టి ఆరోపణలు రుజువు కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
www.shanmukhavelugu.com
28 Feb 2026 - Page 3


(ఫైల్ ఫోటో)

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 2)
అధికారం చేతిలో ఉంటే ఏదైనా చేయచ్చు అని అంటారు. అందుకు నిదర్శనంగా మార్కాపురం జిల్లాలో ఇద్దరి అధికారుల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంలో ఎక్కడైనా సరే ఓ ఉద్యోగి సస్పెండ్ అయితే తిరిగి ఆ అధికారికి సస్పెండ్ అయిన చోట తిరిగి పోస్టింగ్ ఇవ్వడం రాష్ట్రంలో ఎక్కడా మనం చూసి ఉండము. అందుకు స్పష్టమైన ఉత్తర్వులు కూడా ఉన్నాయి. కాని అలా పోస్గింగ్ ఇచ్చిన దానికి మార్కాపురం జిల్లా వేదికయ్యింది. డ్వామా కార్యాలయం పొదిలి మండల ఎపిఓగా పని చేసిన వై మహాలక్ష్మిని గత నెలలో మీడియాలో వచ్చిన కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారు. అదే విధంగా ఫిబ్రవరి నెలలో మార్కాపురం మండలంలో ఈసీగా విధులు నిర్వర్తిస్తున్న బెల్లంకొండ కిషోర్‌ను విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి వారి పై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో వారిద్దరినీ ఒకరి తర్వాత ఇంకొకరిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గత కొద్ది రోజుల క్రితం తిరిగి వారిరువురిని వారు ఎక్కడైతే సస్పెండ్ అయ్యారో అవే స్థానాల్లో ప్రకాశం జిల్లా డ్వామా ఉన్నతాధికారులు తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూడడంతో ఇప్పుడు పొదిలి అధికారుల్లో ఆమె పోస్టింగ్ పై తీవ్ర చర్చ సాగుతోంది. వాస్తవానికి ఓ అధికారి ఎక్కడ పని చేస్తున్నారో అక్కడ గనుక సస్పెండ్ అయినట్లేతే ఆ అధికారి ఉన్నతాధికారులు పోస్టింగ్ ఇవ్వదలచినప్పటికీ సస్పెండ్ అయిన చోటకు తిరిగి పోస్టింగ్ ఇవ్వరు. ఇలా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఎక్కడా ఇలా జరిగిన సందర్భాలు లేవనే చెప్పాలి. మరి ఒక్క మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి, మార్కాపురం మండలాల్లో మాత్రమే ఆ నిబంధనలను ఉన్నతాధికారులు ఎందుకు గాలికొదిలేశారో వారికే తెలియాలి. సరే పోస్టింగ్ ఇచ్చారనే అనుకున్నా పొదిలి ఏపిఓ వ్యవహార తీరు మాత్రం మార్పు లేదు. గురువారం కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పండుగలా కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వీబీజీ రామ్ జీ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. అయితే ఒక్క పొదిలి మండలంలో మాత్రం ఏపిఓ మహాలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ఎక్కడ ప్రారంభించారో కనీసం మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం చూస్తే ఆమె సస్పెండ్ అయినా తీరు మారలేదని స్పష్టమవుతుంది. కేవలం ఆమెకు నచ్చిన మీడియా వారికి మాత్రమే సమాచారం ఇచ్చిందనే ఆరోపణలు కూడా మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇది ప్రభుత్వ పథకం. ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం మీడియాలో విశేషంగా ప్రచారం కావాలని ప్రభుత్వం చెబుతున్నా ఆమెకు మాత్రం మీడియాలో ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు ప్రచారం కావడం ఇష్టం లేనట్లుగా వ్యవహరిస్తుందని ఈ ఘటన రుజువు చేస్తుంది. ఇలా మీడియాను సైతం పక్కన పెట్టిన ఈమె పై ప్రకాశం జిల్లా డ్వామా ఉన్నతాధికారులకు ఎందుకంత ఆశక్తో వారికే తెలియాలి. రాష్ట్రంలో ఎక్కడా ఎవరూ ఇవ్వని విధంగా సస్పెండ్ అయిన చోట తిరిగి పోస్టింగ్ ఇవ్వడం పై ఇప్పటికైనా ప్రకాశం జిల్లా డ్వామా ఉన్నతాధికారులు పున పరిశీలిస్తారో లేక జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సదరు అధికారుల పై చర్యలు తీసుకునే వరకు వేచి చూస్తారో కాలమే సమాధానం చెబుతోంది.



# ఆర్థిక నీటి భద్రతతో పాటు మౌలిక వసతులు కల్పనే వీబీజీ రామ్ జీ పథక లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 2)
గ్రామీణ ప్రజలకు ఆర్థిక భద్రత, నీటి భద్రతతో పాటు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకాన్ని తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. గురువారం కనిగిరి మండలంలోని లింగారెడ్డి పల్లి గ్రామంలో వీబీజీ రామ్ జీ పథకాన్ని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తో కలిసి ఆమె ప్రారంభించారు. (తరువాయి 4లో...)

# పని చేయనప్పుడు మీకు ఉద్యోగం ఎందుకు? జీతం ఎందుకు?

### ప్రభుత్వ కార్యాలయం అంటే సత్రం అనుకుంటున్నారా? పద్ధతి మార్చుకోండి....లేదా ఉద్యోగానికి విఆర్ఎస్ పెట్టి వెళ్లిపోండి

### నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకునే ప్రసక్తే లేదు

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 2)
పని చేయనప్పుడు మీకు ఉద్యోగం ఎందుకు? జీతం ఎందుకు? ప్రభుత్వ కార్యాలయం అంటే సత్రం అనుకుంటున్నారా? పద్ధతి మార్చుకోండి... లేదా ఉద్యోగానికి విఆర్ఎస్ పెట్టి వెళ్లిపోండి... అంతే తప్ప నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకునే ప్రసక్తే లేదు అని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి జాబ్ చార్ట్ పై ఆరా తీసి వారు చేస్తున్న పనిని ప్రత్యక్షంగా పరిశీలించారు. విధుల నిర్వహణలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంపై కలెక్టర్ ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి, పనితీరు మార్చుకోకపోతే ఇకనుంచి ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండదని హెచ్చరించారు. సుమారు గంటన్నర పాటు కార్పొరేషన్ లోని ప్రతి గదినీ తనిఖీ చేసి సంబంధిత ఫైళ్లను పరిశీలించారు. (తరువాయి 4లో...)

# గడ్డం చేయనన్నందుకు ఒంగోలులో హత్య

### ఒంగోలులో కలకలం రేపిన ఘటన



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 2)
ఫుల్ గా మద్యం సేవించిన వ్యక్తికి గడ్డం చేయనన్నందుకు హత్య చేసిన ఘటన ఒంగోలులో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఒంగోలు తాలూకా సిఐ విజయకృష్ణ చెప్పిన వివరాల మేరకు ఒంగోలులోని 60 అడుగుల రోడ్డులో శ్రీనివాస సెలూన్ షాపులోకి కొండెపి మండలం నేతివారిపాలెం (తరువాయి 4లో...)

### వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో

# వీబీజీ రామ్ జీ పథకం ఒక కీలక మైలురాయి

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి




(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 2)
వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో వీబీజీ రామ్ జీ పథకం ఒక కీలక మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. బుధవారం కొండపి నియోజకవర్గం, జరుగుమల్లి మండలం, వావిలేటిపాడు గ్రామంలో వికసిత్ భారత్ – జి రామ్ జి పథకాన్ని మంత్రి జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. శ్రామికులతో కలిసి మంత్రి, కలెక్టర్ గడ్డపారతో మట్టి తవ్వారు. ఈ సందర్భంగా గ్రామంలో వీబీజీ రామ్ జీ పథకం పై (తరువాయి 4లో...)

# ఆర్థిక నీటి భద్రతతో పాటు మౌలిక వసతులు కల్పనే వీబీజీ రామ్ జీ పథక లక్ష్యం







ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరింత మంది గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకే ఈ పథకాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు. గతంలో వంద రోజులు ఈ పథకంలో పని ఉండగా దాన్ని ఇప్పుడు 125 రోజులకు పెంచడం హర్షించదగ్గ విషయం అన్నారు. అదేవిధంగా ఈ పథకంలో వేతనం రూ. 312 కు పెంచడం జరిగిందని వివరించారు. ఇటువంటి కార్యక్రమాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకొని జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకంలో భాగస్వాములై ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని కోరారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకాన్ని మొదటిసారిగా మన రాష్ట్రంలోనే ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. వీ బీ జీ రామ్ జీ పథకానికి సంబంధించి మన రాష్ట్రంలో రూ.7707 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. కేంద్ర వాటా తో పాటు రాష్ట్ర నిధులను జమ చేసి ఈ పథకాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో అజయ్ కుమార్, డ్వామా ఇన్చార్జి పీడీ చిరంజీవి, ఏపీడీ నిర్మలాదేవి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో వీబీజీ రామ్ జీ పథకం ఒక కీలక మైలురాయి



అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ ఫలాల విస్తరణే ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల లక్ష్యమన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మెరుగైన మార్పులు చేపట్టి వీబీజీ రామ్ జీ పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కొత్త చట్టం వల్ల గ్రామీణులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ పథకం కింద 125రోజుల పని లభిస్తుందన్నారు. ప్రాంతాల మధ్య పనులలలో వత్యాసం ఉండకుండా అన్ని ప్రాంతాలకు పనులు, నిధుల కేటాయింపులో ఏకరూపత ఉంటుందన్నారు. ఈపథకం వల్ల శ్రామికులకు మరిన్ని హక్కులు, భద్రత లభిస్తుందన్నారు. వీజీబీ రామ్ జీ పథకం దేశ గ్రామీణ అభివృద్ధికి కొత్త దిశను చూపించబోతోందని, వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో వీబీజీ రామ్ జీ పథకం ఒక కీలక మైలురాయిగా నిలవనుందన్నారు. ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూర దృష్టి, సమర్థ నాయకత్వంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి పదంలో దూసుకుపోతున్నట్లు మంత్రి తెలిపారు.






గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 స్థానంలో కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీజీ రామ్ జీ) చట్టం దేశవ్యాప్తంగా ఈ రోజు నుండి అమల్లోకి వచ్చిందన్నారు. దేశ గ్రామీణ అభివృద్ధికి వీబీజీ రామ్ జీ పథకం కొత్త దిశను చూపించబోతోందన్నారు. వీబీజీ రామ్ జీ పథకంలో ఎన్నో మెరుగైన అంశాలు ఉన్నాయన్నారు. గతంలో కరవు పని,



ఉపాధి పని అని అనేవారని ఇకపై జీ రామ్ జీ పని అని చెప్పాలన్నారు. గ్రామీణ ఉపాధి కల్పన, జీవనోపాధి విస్తరణే లక్ష్యంగా నూతన చట్టం అమలు కానున్నట్లు తెలిపారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భూగర్భ జలాల పెంపు, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత పెంచాలన్నారు. సెల్ఫ్‌గా పనిచేసుకొని అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుచున్నదన్నారు. గ్రామా సభలు నిర్వహించుకుని గ్రామంలో ఏ ఏ పనులు చేపట్టాలో ప్రజలే నిర్ణయించుకునే అవకాశాన్ని ఈ పథకంలో పొందపర్చడం జరిగిందన్నారు. వీబీజీ రామ్ జీ పథకం అమలులోకి రావడంతో ఇంతకు ముందు ఉన్నటువంటి 100 రోజుల పని దినాలు 125 రోజులకు పెరగడం జరిగిందన్నారు. వేతనం కుడా పెంచడం, పని కల్పించాల్సిన భాద్యత ప్రభుత్వం పై ఉండటం ఈ పదకంలో పొందపర్చడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని ఉపయోగించుకుని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను గణనీయంగా అభివృద్ధి చేసుకోవడంతో పాటు తమ కుటుంబ జీవనోపాదిని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి ఎంపిపి నిర్మలమ్మ, ఒంగోలు ఆర్‌డిఓ చంద్రశేఖర్ నాయుడు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఎపిడి రవి కుమార్, హౌసింగ్ పిడి మారుతి ప్రసాద్, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వేజ్ సీకర్స్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పని చేయనప్పుడు మీకు ఉద్యోగం ఎందుకు? జీతం ఎందుకు?







రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని సిబ్బందిని మార్చాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పని అవసరాలను గుర్తించి సిబ్బందిని రేషనలైజ్ చేయాలన్నారు. పారిశుద్ధ్యం కాకుండా ఇతర విభాగాలలో అవుట్ సోర్స్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది వివరాలను తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిబ్బంది తమకు ఫోన్ చేసే ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని కలెక్టర్ చెప్పారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారంపైనా తిరిగి వారితో మాట్లాడి ఆరా తీయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది అందరూ బయోమెట్రిక్ హాజరు వేయాలని, విధుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో కచ్చితంగా సంతకం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనరుకు చెప్పారు. కార్పొరేషన్ ప్రాంగణంలోనూ, కార్యాలయంలో కూడా సిసి కెమెరాలు పూర్తిస్థాయిలో పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### అందరూ ఫీల్డ్ లో ఉండాలి...

పారిశుద్ధ్య కార్మికులు అందరూ కచ్చితంగా వేకువజామునే ఫీల్డ్ లో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యము, త్రాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ' ఆపరేషన్ క్లీన్ స్వీప్ ' మరో వారం రోజులు ఉన్నందున నగరం మొత్తం పారిశుద్ధ్య కార్యకలాపాలను ఉధృతం చేయాలన్నారు.

నగర ప్రజలు తమ సమస్యలను మున్సిపాలిటీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన 18004252381 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

### ప్రతివారం వస్తా... పురోగతి ఉండాలి

నగర పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపాలిటీలో ప్రత్యేకంగా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కార్పొరేషన్ లోని స్పెషల్ ఆఫీసర్ చాంబర్ వద్దకు వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారం, ప్రజలకు సేవలు అందించడంలో ప్రతివారం నాణ్యత మరింత మెరుగుపడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### పోతురాజు కాలువ పై ప్రత్యేక దృష్టి

గత ఏడాది మొంథా తుఫాను సమయంలో తలెత్తిన పరిస్థితి పునరావృతం కాకుండా పోతురాజు కాలువ పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పూడికతీతతో పాటు కాలువగట్లపై ఆక్రమణలు తొలగిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. నగరంలోని ఖాళీ మున్సిపల్ స్థలాలను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేస్తామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్ళు నిర్మించేందుకు ముందుకు వచ్చే వారికి కేటాయిస్తామన్నారు. నగరంలోని రోడ్ల వెంట ఫుట్ పాత్ కూడా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఒంగోలు నగరాన్ని క్లీన్ సిటీగా మారుస్తామని చెప్పారు. జిల్లాకు లక్షల కోట్ల రూపాయలలో పెట్టుబడును వస్తున్నందున ఆయా కంపెనీలకు సమీపంలో ఉన్న ఒంగోలు నగరాన్ని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయబోతున్నట్లు వివరించారు. ఈ విషయంలో ప్రజలు కూడా అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కమిషనర్ వెంకట కృష్ణయ్య, డీఈఈ పద్మజ, ఎంహెచ్ఓ వైష్ణవి, ఇతర అధికారులు ఉన్నారు.

# గడ్డం చేయనన్నందుకు ఒంగోలులో హత్య



గ్రామానికి చెందిన నాగినేని రామారావు అనే వ్యక్తి ఫుల్ గా మద్యం సేవించి తనకు గడ్డం చేయాలని షాపులో పనిచేస్తున్న కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన గొట్టిపాటి మహేంద్ర అనే వ్యక్తిని అడగడం జరిగింది. ఫుల్ గా





మద్యం సేవించిన రామారావు పరిస్థితిని గమనించిన మహేంద్ర ఇప్పుడు గడ్డం చేయటం కుదరదని, కొంత సమయం తర్వాత వచ్చి గడ్డం చేయించుకోవచ్చని చెప్పారు. దీంతో రామారావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తనకు గడ్డం చేయనందుకు కత్తితో మహేంద్ర పై దాడి చేసి గాయం చేశారు. దీంతో మహేంద్ర ను హుటా హుటిన చికిత్స నిమిత్తం రిమ్స్ కి తరలించారు. చికిత్స పొందుతూ మహేంద్ర (45) రిమ్స్‌లో మృతి చెందినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రామారావు, మహేంద్రకు ఎటువంటి పాత కక్షలు లేవని, కేవలం మద్యం ఫుల్‌గా తాగినందువల్లే రామారావు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని, రామారావు తల పై కూడా గాయాలు ఉన్నట్లు గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలలో విజయ బావుట ఎగురవేసిన వివేకానంద జూనియర్ కళాశాల

**ప్రకటించిన ఈఏపీ సెట్ ఇంజనీరింగ్, మెడిసిన్ ఎంట్రన్స్ ఫలితాలలో మరోసారి శ్రీ వివేకానంద సత్తా చాటిన విద్యార్థులు**

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 2)

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు విజయ బావుటా ఎగురువేశారు. విజయం సాధించిన వారిలో బైపీసీ (ఇంగ్లీష్ మీడియం)లో షేక్ మరియా బుష్రా 7,000, ఎండి తాహిరా ఫాతిమా 14,000, కె అక్ష 18,000, కె షైనీ 28,000, జె రవిత్రేణి 28,000, కె నవ్య శ్రీ 31,634, కె అనిత 33,000, వై గ్రేసీ ఇజ్రాయెల్ 38,000, ఐ సుప్రియా 42,000 ర్యాంకులు సాధించారు. అదే విధంగా ఎంపీసీ (ఇంగ్లీష్ మీడియం)లో బి నందిని 12,085, షేక్ అబిద్ అహ్మద్ 17,000, ఎస్ శిరీష 35,000, సి హెచ్ అనూష 36,000 ర్యాంకు సాధించారు. వీటితో పాటు అన్ని గ్రూపుల్లోనూ శ్రీ వివేకానంద విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని కళాశాల డైరక్టర్లు వై వెంకటేశ్వర్లు, కెవి రమణారెడ్డిలు ఓ ప్రకటనలో తెలిపారు.

## నూతన డిఆర్ఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)



ప్రకాశం జిల్లా నూతన డిఆర్ఓగా వెంకట రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి రాజాబాబును తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు వెంకట రమణ ఏపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్‌గా విజయవాడలో విధులు నిర్వహించారు.

# అంగన్వాడీలకు బీఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలి

తహసిల్దార్‌కు సీఐటీయూ వినతి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 2)
మండలంలోని అంగన్వాడీలకు బీఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఉలవపాడు తహసిల్దార్ రవిశంకర్ కి వినతి పత్రం అందించారు. ఇటీవల రెవిన్యూ అధికారులు ఉలవపాడు మండలంలోని ఉలవపాడు, కరేడు, ఇతర గ్రామాలలో అంగన్వాడీలను అడిషనల్ బిఎల్ఓలు గా ఉత్తర్వులు ఇచ్చి, డ్యూటీలు చేయమని ఆదేశించారు. ఇది తెలుసుకున్న అంగన్వాడీలు యాప్ లతో ఈపాటికే అంగన్వాడీలకు పని భారం పెరిగిందని పేర్కొన్నారు. ఇది అదనపు డ్యూటీ అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మేమంతా బియల్ఓలుగా పని చేసినప్పుడు రాజకీయ వేధింపులు ఎదుర్కొన్నామని, అందుకే పోరాటం చేసి అంగన్వాడీలకు బిఎల్ఓ డ్యూటీ లో ఉన్న రద్దు చేయించుకున్నామని తెలిపారు. ఇప్పుడు కొత్తగా అంగన్వాడీలను అడిషనల్ బి యల్ ఓ లు గా నియమించడం సరికాదని వారు వాపోయారు. మేము చేయలేమని ఇది అదనపు భారమని తెలుపుతూ తహసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చారు. తహసిల్దార్ ఆఫీస్ వద్ద కొద్దిసేపు నినదించారు. వీరిని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడారు. తక్షణమే అంగన్వాడీలను బిఎల్ఓ లుగా మినహాయించాలని తహసిల్దార్‌ను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ ఇంది రావతి, సిఐటియు మండల నాయకులు నాయకురాలు ఎస్ గీత, అంగన్వాడీలు ఎం పద్మావతి, జె ప్రవీణ, శ్రీదేవి, వెంకట రమణమ్మ, సునీత, హేమలత , యమున తదితరులు ఉన్నారు.

# వీబీజీ రామ్ జీ ని ప్రారంభించిన ఎంపిడిఓ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 2)
నేటి నుండి ప్రారంభించనున్న వీబీజీ రామ్‌జీ నందు ఒక కుటుంబానికి వంద రోజులు బదులు 125 రోజులు పనిదినాలు కల్పింస్తూ శ్రామికుల వేతన చెల్లింపులో జాప్యం లేకుండా క్రమం తప్పకుండా వారినికి ఒక రోజు వేతనాలు చెల్లిస్తారని మండల ఎంపిడిఓ కె ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో గురువారం వీబీజీ రామ్‌జీ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవీకా మిషన్) ని డ్వామా అధికారుల, కూలీల సమక్షంలో మండల ఎంఫిడిఓ కే ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో గరిష్టంగా ఒక కుటుంబానికి 125 రోజులు పనిదినాలు, శ్రామికుల వేతన చెల్లింపులో జాప్యం లేకుండా వేతనాలు చెల్లిస్తారన్నారు. ఉపాధి కావాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తికి 15 రోజుల్లోగా పని కల్పించాలి లేని పక్షంలో నిరుద్యోగ భృతి చెల్లించాలని చట్టంలో వుందన్ని పేర్కొన్నారు.మండల ఉపాధి కూలీలు మరింత పని దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ లక్ష్మీ కుమారి, అజాద్, టి జయరావు, శ్రీనివాసరావు, టిఎ, మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 2)
పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి అన్నారు. గురువారం ఒంగోలు పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రక్రియను స్వయంగా పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేలంలో 'నో బిడ్' సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారులందరూ చురుగ్గా వేలంలో పాల్గొని రైతులకు న్యాయం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, పొగాకు పండించే రైతులకు ఖచ్చితంగా గిట్టుబాటు ధర కల్పించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వేలం కేంద్రాలలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వ్యాపారులు అందరూ వేలంలో చురుగ్గా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారులతో సమన్వయం చేసుకుని రైతుల పొగాకును కొనుగోలు చేసేలా చూడాలని స్పష్టం చేశారు? రాష్ట్రంలోని పొగాకు రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి మంత్రులను, ప్రజా ప్రతినిధులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే మేము వేలం కేంద్రాలను పరిశీలిస్తూ రైతులకు అండగా ఉంటున్నాం. ప్రభుత్వ కఠిన నిబంధనల వల్ల గతంతో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితి చాలా మెరుగైంది. అయితే ఇది ఇంకా మెరుగవ్వాల్సి ఉంది అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గత ఏడాది బర్లీ పొగాకు అమ్ముడుపోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి గుర్తు చేశారు. ఆ సమయంలో మన ప్రభుత్వం స్పందించి రూ.300 కోట్లు కేటాయించి ఆ పొగాకును కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత సీజన్‌లోనూ ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం శ్రమిస్తుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# హాజీలకు ఇచ్చిన హామీ మేరకు నగదు జమ

## ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మౌలానా షేక్ ఆబిద్ ఖాస్మీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)
ముస్లింలకు అత్యంత పవిత్రమైన హజ్ యాత్రను పూర్తి చేసుకుని తిరిగి వారి స్వస్థలాలకు చేరుకున్న హాజీలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం లక్ష రూపాయలు సబ్సిడీని వాళ్ళ బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందని ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మౌలానా షేక్ ఆబిద్ ఖాస్మీ అన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు షేక్ కఫీల్ బాషా, ముస్లిం నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆబిద్ ఖాస్మీ మాట్లాడుతూ 2025-2026 ఏడాదికి హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకున్న వారిలో విజయవాడ విమానాశ్రయం నుండి హజ్ యాత్రకు వెళ్లిన 331 మంది హాజీలకు రూ.3 కోట్ల 31 లక్ష రూపాయలు వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయడం ముస్లింల పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమానికి వారి ఆధ్యాత్మిక, సామాజిక అవసరాలకు ప్రాధాన్యం ఇస్తుందన్న సంగతి మరోమారు బహిర్గతం అయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో హాజీలకు సబ్సిడీ రాదని కొంతమంది వైసీపీ ముస్లిం నాయకులు అపోహలు సృష్టించారని హాజీల అకౌంట్లో లక్ష రూపాయలు జమ అవ్వటంతో వారి నోట మాట రావడం లేదని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 2026-27 సంవత్సరానికి గాను హజ్ యాత్ర చేయదలచుకున్న వారు విజయవాడ విమానాశ్రయాన్ని ఎన్నుకోవాల్సిందిగా ఆబిద్ ఖాస్మీ విజ్ఞప్తి చేశారు. టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు కఫీల్ బాషా.. మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తోటే ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వాలు నడుము కట్టాయని పేర్కొన్నారు. ఉర్దూ భాష ను రెండవ అధికారిక భాషగా గుర్తించడం, హైదరాబాద్ లో హజ్ హౌస్ నిర్మాణం, హజ్ యాత్రికులకు సబ్సిడీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా విద్యా.. ఉపాధి రంగాలలో రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేయడం, ఇలా అనేక సంస్కరణలు తెలుగుదేశం పార్టీ పాలనలోనే పురుడు పోసుకున్నాయని అన్నారు. అబద్దాలను ప్రచారం చేయటంలో అసత్యాలను వల్లేవేటంలో దిట్టగా పేరుందిన వైకాపా శ్రేణులు హాజీలకు లక్ష రూపాయలు సబ్సిడీ రాదంటూ అపోహలు సృష్టించి హాజీలను అయోమయానికి గురిచేసి టిడిపి పై బురదజల్లే ప్రయత్నం చేయడం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని విమర్శించారు. ముస్లింల సంక్షేమానికి వారి రాజకీయ సామాజిక ఆధ్యాత్మిక ఉపాధి విద్యా రంగాలలో అండగా నిలబడింది, నిలబడేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అన్న సంగతి ముస్లిం సమాజం గుర్తించిందన్నారు. వైకాపా అసత్యాలు, దుష్ప్రచారాలు నమ్మే దుస్థితిలో ముస్లిం సమాజం లేదన్న సంగతి వైకాపా ఫేక్ బ్యాచ్ గుర్తుంచుకుంటే చాలని వారు దుయ్యబట్టారు.

# అలారం లాక్‌లతో ఇళ్ల భద్రతను పెంచుకోండి

## కంభం సీఐ కె మల్లికార్జున




(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 2)
సర్కిల్ పరిధిలో ఇటీవల దొంగతనాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంభం సీఐ కె మల్లికార్జున సూచించారు. ఇళ్ల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు అలారం లాక్‌ల వినియోగాన్ని ప్రజలు ప్రోత్సహించాలని ఆయన తెలిపారు. ఇంటి ప్రధాన తలుపులు, గేట్లు, షట్టర్లకు వీలైనంత వరకు అలారం లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా బలవంతంగా తాళాన్ని తెరవడానికి లేదా కదిలించడానికి ప్రయత్నించిన వెంటనే ఈ లాక్‌లు పెద్ద శబ్దంతో అలారం మోగించి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేస్తాయని తెలిపారు. దీంతో దొంగతనాలను అరికట్టే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అయితే అలారం లాక్‌ను మాత్రమే పూర్తి భద్రతగా భావించకుండా, నాణ్యమైన ప్రధాన తాళంతో పాటు అదనపు భద్రతా చర్యగా వినియోగించాలని సీఐ మల్లికార్జున సూచించారు. ప్రతి కుటుంబం తమ నివాసాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలని,వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

# బ్యాంక్, క్లర్క్ ఉద్యోగానికి ఎంపికైన నేతాజీ ఇన్స్టిట్యూట్ విద్యార్థి



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 2)
ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్ (ఐబిపిఎస్) వారు విడుదల చేసిన ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బి) క్లర్క్ ఉద్యోగాల తుది ఫలితాలలో మార్కాపురం పట్టణంలోని నేతాజీ ఇన్‌స్టిట్యూట్ అఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ నందు శిక్షణ పొందిన దుమావత్ అంజి నాయక్ మధ్యప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆఫీస్‌అసిస్టెంట్ (క్లర్క్) ఉద్యోగానికి ఎంపికైనట్లు సంస్థ గౌరవ సలహాదారులు కొత్తేరువ కాశిరెడ్డి పాత్రికేయులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగం సాధించిన అభ్యర్థి అంజినాయక్ మాట్లాడుతూ బ్యాంక్ క్లర్క్ ఉద్యోగం సాధించడానికి కారణం కేవలం నేతాజీ ఇన్స్టిట్యూట్ అధ్యాపకుల బోధన, మెలుకువలు, అర్థమెటిక్ ,రీజనింగ్లోతారక్, కె కాశిరెడ్డి ఉపాధ్యాయులు అందించిన షార్ట్కట్ మెథడ్స్, స్పీడ్, మాథ్స్, ట్రిక్కులు చాలా దోహదపడ్డాయని తెలియజేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగం సాధించిన అంజినాయక్‌ను ఇన్స్టిట్యూట్ అధ్యాపక బృందం తారకబ్రహ్మం, వహీదాషారన్, గౌతమ్, ఫణికుమార్, ఫణింద్రరెడ్డి, వీరభద్రారెడ్డి, రమణారెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్వర నాయక్, గణేష్ అభినందనలు తెలియజేశారు.

# డీవీఆర్ సైనిక్ స్కూల్ నందు ఉచిత వైద్య శిబిరం







(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జులై 2)
జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ డీవీఆర్ సైనిక్ స్కూల్ నందు స్కూల్ చైర్మన్ గోరంట్ల సుబ్బారావు అధ్వర్యంలో అగర్వాల్ ఐ హాస్పిటల్ , రమ్య డెంటల్ కేర్‌కు చెందిన డాక్టర్లు పర్యవేక్షణలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి పైగా విద్యార్థులకు పాల్గొనగా డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీ కావ్య, డాక్టర్ ప్రమీలా రాయ్, మేనేజర్ సుధాకర్ మరియు సింగరాయకొండ, మేదరమెట్ల లలోని రమ్య డెంటల్ కేర్‌కు చెందిన డాక్టర్ ఆర్. కొండలరావు, డెంటల్ సర్జన్ డాక్టర్ రమ్య తాళ్లూరి, ఫేస్ కాస్మెటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ రిచల్ యురోహియా ఇంప్లాంటాలజిస్ట్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్ర, దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, అలాగే బృందం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ గోరంట్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పేర్కొన్నారు. తమ విలువైన సమయాన్ని కేటాయించి విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు అందించిన డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్, రమ్య డెంటల్ కేర్ వైద్య బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోరంట్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్, డైరెక్టర్ సచ్చిదానంద మూర్తి, వైస్ ప్రిన్సిపల్స్ సాయి అనూష, డాక్టర్లు లక్ష్మీ కావ్య, డాక్టర్ ప్రమీలా రాయ్, ఆర్ కొండలరావు, రమ్య తాళ్లూరి, రిచల్ యురోహియా, ఆషా క్రాంతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు జిల్లా జూనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)
రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొనే జిల్లా జూనియర్ పురుషుల జట్టు ఎంపిక గురువారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారితో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియ జిల్లా కార్యదర్శి ఏ సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన జట్టు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని కార్యదర్శి ఏ సుందరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు హనుమాచారి, డైట్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ మార్కండేయులు, డైట్ సీనియర్ లెక్చరర్ తిరుపతయ్య, పిఈటి శ్రీనివాసరావు పాల్గొన్నారని హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తిరుమలశెట్టి రవికుమార్ తెలియజేశారు.

## విద్యుత్ సరఫరా, సేవల పై వినియోగదారుల్లో సంతృప్తి స్థాయి పెంపే లక్ష్యంగా పనిచేయాలి

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 2)
విద్యుత్ సరఫరా, సేవలపై వినియోగదారుల్లో సంతృప్తి స్థాయి పెంపే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ‘ సూర్య ఘర్ ’ పథకం అమలుపై గురువారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్యానళ్లు అమర్చటంలో పురోగతిపై ఏజెన్సీల వారీగా కలెక్టర్ సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు సోలార్ సెట్స్ అమర్చేలా పనిచేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో గుర్తించిన నాలుగు మోడల్ సోలార్ గ్రామాలలో 100% రూఫ్ టాప్ సోలార్ ప్యానళ్ళను బిగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఎల్లవేళలా వినియోగదారులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ చెప్పారు. ‘ మీకోసం ’ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు అన్నారు. విద్యుత్ సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి శాతం మెరుగ్గా ఉండేలా సిబ్బంది, అధికారులు పనిచేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సచించారు. ఈ సమావేశంలో ఏపీసిపిడిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, అన్ని డివిజన్ల ఈఈలు, జెడ్పి సీఈవో చిరంజీవి, ఎల్‌డిఎం రమేష్, డిఆర్డిఏ, నెడ్ క్యాప్ అధికారులు, సోలార్ వెండర్లు పాల్గొన్నారు.

## వీబీజీ రామ్‌జి కార్యక్రమం ప్రారంభించిన టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 2)
వీబీజీ రామ్ జీ కార్యక్రమం పెద్దారవీడు గ్రామం నందు వైపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గురువారం ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రద్దు తర్వాత వీజీబీ రామ్ జీ కార్యక్రమం ప్రారంభించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టంలో 125 రోజుల పనిదినాలు, వ్యవసాయకాలంలో 60 రోజుల పనివిరామం, గ్రామాలులో మౌలిక వసతులు కల్పన, ప్రకృతి వైపిరిత్యాల పనులు, మొదలైనవి నీటి సంరక్షణ పనులు వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, మండల నాయుకులు, మండల్ కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ ఆకుల సాంబశివయ్య, ఏపీవోలు, ఈసీ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 2)
మొహరం పండుగ సందర్భంగా లింగోజిపల్లి గ్రామంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను వితరణ చేసి అందించిన బల్లు లక్ష్మణ్ కి అభినందనలు తెలిపి గ్రామ వాసులు శాలువాతో ఘన సన్మానం చేశారు. బహుమతులను వితరణ చేసిన బల్లు లక్ష్మణ్ ను గ్రీన్ స్పోర్ట్స్ మాన్ ఆఫ్ ఇండియా సయ్యద్ రఫీ అభినందించారు.

## శ్రీ సాయి హై స్కూల్ విద్యార్థులు నవోదయలో ఘన విజయం









(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 2)
మండలంలోని శ్రీ సాయి హై స్కూల్ విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి నవోదయ సీట్లను సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. నవోదయ ప్రవేశ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. జేఎన్‌వీఎస్‌టీ ద్వారా ఎంపికైన విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో 8వ , 9వ తరగతిలో ప్రవేశం పొందనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిరంతర శిక్షణ, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి కారణం. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పరీక్షల్లో కూడా మా విద్యార్థులు రాణించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తామని, వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

### అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లింగసముద్రం మండలంలో 25 మందికి 13.75 లక్షలు మంజూరు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 2):
ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా లింగసముద్రం మండలంలోని 25 మంది లబ్ధిదారులకు 13.75 లక్షల రూపాయల ఆర్థిక సహాయాలు మంజూరు కాగా... గౌరవ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గారు గురువారం వాటిని లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలో జవీ=ఖీ చెక్కులు పంపిణీ చేయడం ఇది 39వ సారి అని, మొత్తంగా 1488 మంది లబ్ధిదారులకు 11.54 కోట్ల రూపాయలు అందించామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ.... జగన్ ప్రభుత్వంలో ఇలాంటి సహాయాలు పేదలకు అందలేదని, కూటమి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ, పార్టీలకు అతీతంగా సహాయం అందిస్తున్నామని చెప్పారు. మా ప్రభుత్వంలో నిధుల్లో సింహభాగం సంక్షేమానికి కేటాయిస్తున్నాం. అభివృద్ధికీ ప్రాధాన్యం ఇస్తున్నాం. రాష్ట్రం విడిపోయిన తరువాత అన్ని వనరులను ఉపయోగించుకుని, పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుతో పురోగతి సాధిస్తున్నాం. చంద్రబాబు చిత్తశుద్ధి, ముందుచూపు మన రాష్ట్రానికి గొప్ప వరం... అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. సహాయాలు అందుకున్నవారు ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, ఏఎంసీ చైర్ పర్సన్ గా నియమితులైన రాయపాటి సుభాషిణి, ఉన్నం వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన బిఎడ్ పరీక్షలు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 2)
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న బిఎడ్ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. కనిగిరి జిసి అండ్ వైపిఎన్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్ట్ ఎడ్యుకేషన్ పరీక్షకు మొత్తం 342 మందికి గాను 333 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మిగతా 9 మంది గైర్హాజరైనట్లు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిశీలకుడు సాకం కాశిరెడ్డి, కళాశాల సిఎస్ మస్తానమ్మ తెలిపారు.

## కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన మండల అభివృద్ధి అధికారి మురళి

### 100 రోజుల నుండి 125 రోజులకు పెంచిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి




(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 2)
వీబిజి రామ్ జీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో మురళి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో కూలీలకు 100 రోజుల నుండి 125 రోజులు పనిదినాలున్నాయని అన్నారు. దినసారి వేతనం 307 నుండి 312 రూపాయలకు ప్రభుత్వం పెంచిందని ఆయన తెలిపారు. 212 నుండి నాలుగు కేటగిరీలలో 318 పనులు చేపట్టవచ్చాన్నారు. జల సంరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనోపాధి, విపత్తుల నిర్వహణ కేటగిరీలలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుజాత, మండల తెలుగు యువత అధ్యక్షులు గుత్తా శ్రీనివాస్ చౌదరి, కంచుపాటి కోటేశ్వరరావు, మాగులూరి అచ్చయ్య, గుర్రం సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ పెద్ద పిచ్చయ్య సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## నేడు కడపకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

### జేఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఏర్పాట్లను పరిశీలించిన ఇన్చార్జ్ మంత్రి ఎస్ సవిత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 2)
ఈ నెల 3న శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటనను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి, బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత పిలుపునిచ్చారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లె వద్ద జేఎస్ డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ ప్రాంతంలో ముఖ్యమంత్రి పర్యటించే




స్థలాలను, ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి ఆదినారాయణరెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా జేసీ డాక్టర్ నిధీమీనా, సబ్ కలెక్టర్ భావన, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, నాయకులు భూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కర్మాగార సైట్‌లో ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, శంకుస్థాపన శిలాఫలకాలు, బహిరంగ సభావేదిక, ముఖ్యమంత్రి, మంత్రుల తాత్కాలిక రెస్టింగ్ రూమ్స్, కంపెనీ ఎక్స్ పీరియన్స్ జోన్, గ్రీన్ రూమ్ మొదలైన అన్ని ప్రాంతాలను అధికారులు మంత్రికి చూపించారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.

**హాజరుకానున్న వీఐపీలు :** 3వ తేదీ శుక్రవారం జేఎస్ డబ్ల్యూ రాయలసీమ లిమిటెడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ పనుల శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మలు హాజరుకానున్నారు. రాయలసీమ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కాబోతోందని మంత్రి సవిత అన్నారు. ప్రజలు ఇచ్చిన నమ్మకంతో సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ‘స్వర్ణాంధ్రప్రదేశ్’ గా మారుస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని ప్రతి అధికారి బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.








# మావిగన్ నినాదంతో వైసీపీ పతనం తప్పదు



**మొన్న...అమరావతికి ఓకే**
**నిన్న....మూడు రాజధానులు**
**నేడు....మావిగన్**
**మడమ తిప్పడం, మాట తప్పడం ఆయనకు అలవాటే ?**
**జగన్ పై ఎమ్మెల్యే ఇంటూరి విమర్శనాస్త్రాలు**
**పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది**
**4వ తేదీన ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారానికి తరలిరావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే**




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 2)**

కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో అమరావతికి జైకొట్టిన జగన్మోహన్ రెడ్డి, గత ఎన్నికలకు ముందు మూడు రాజధానుల ఆట ఆడాడు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నాడు. చివరకు అదే గన్ పేలి, వైసీపీని పతనం చేయడం ఖాయం. మాట తప్పిన, మడమ తిప్పిన నేతగా జగన్ రికార్డ్ సృష్టించారు. మావిగన్ నినాదంతో ఈసారి ఎన్నికలకు వెళితే వచ్చేది గుండు సున్నా మాత్రమే. ఇటీవల తుంగభద్ర నదిలో మునిగి రెండు ఎద్దులు చనిపోతే, ముఖ్యమంత్రి చంద్రబాబు గారు వెంటనే స్పందించి, కలెక్టర్ కు ఫోన్ చేసి, సహాయం అందించాలని ఆదేశించారు. ఆ విషయాన్ని జగన్ వ్యంగ్యంగా మాట్లాడటం చూసి రైతులు జగన్‌ను చీదరించుకుంటున్నారు. ఈనాడు వాడు, ఆంధ్రజ్యోతి వాడు, టీవీ 5 వాడు అంటూ మీడియా పట్ల జగన్ వ్యాఖ్యానించడం దారుణం. తల్లి, చెల్లి అంటే గౌరవం లేదు. పెద్దలంటే గౌరవం లేదు. రైతులంటే గౌరవం లేదు. మహిళలను కించపరుస్తూ మాట్లాడుతారు. అలాంటి వ్యక్తి నీతులు చెబుతుంటే నవ్వొస్తుంది. పొగాకు ధరలపై ముఖ్యమంత్రి చంద్రబాబు గారు సమావేశం నిర్వహించిన తర్వాత మార్పు వచ్చింది. మార్కెట్ తీరు పై ప్రభుత్వం ప్రతిరోజూ సమీక్ష చేస్తోంది. రెండు మూడు రోజుల్లో గిట్టుబాటు ధరలు పూర్తిగా రైతులుకు అందుతాయి. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కందుకూరులో పొగాకు వేలంకేంద్రం సందర్శనకు వస్తున్నారని ప్రకటించారు. ఆయన గత ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు... కందుకూరు ప్రాంతంలో తుఫాను వల్ల పంటలు మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతే, కనీసం పరామర్శకు కూడా రాలేదు. అలాంటి గోవర్ధన్ రెడ్డికి ఇప్పుడు రైతులపై ప్రేమ పుట్టుకొచ్చింది. వైసిపి నాయకులు రైతులకు సపోర్టుగా, మంచి ఆలోచనతో పొగాకు వేలం కేంద్రానికి రావటంలో తప్పులేదు. రైతుల్లో గందరగోళం సృష్టించాలని చూస్తే ఒప్పుకునేది లేదు. కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఈనెల 4వ తేదీ శనివారం నిర్వహిస్తున్నాం. చైర్ పర్సన్ గా కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన రాయపాటి సుభాషిణి, మరో 14 మంది డైరెక్టర్లు, మరొక ఎక్స్ ఆఫీషియో సభ్యుడు ప్రమాణ స్వీకారం చేస్తారు. గౌరవ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నాను... అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, ఏఎంసీ కాబోయే చైర్మన్ రాయపాటి సుభాషిని, ఎస్సీ సెల్ నాయకులు రాయపాటి శ్రీను, క్లస్టర్ ఇంచార్జి చిత్తారు మల్లికార్జున, వంకాయలపాటి మాల్యాద్రి, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, సీనియర్ నాయకులు షేక్ రఫీ, కందుకూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మెండా లెనిన్, సుదర్శి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలి

**139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)**

జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు నూటికి 50 శాతంగా ఉన్న బీసీలకు జనసేన పార్టీ అధ్యక్ష పదవి కేటాయించి బీసీల పక్షపాతిగా పవన్ కళ్యాణ్ నిరూపించుకోవాలని శ్రీనివాసులు కోరారు.

## 5న బాపట్ల తాలుకా ఎపిజిఇఎ ఎన్నికలు

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 2)**

బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల తాలుకా ఎన్నికలు జూలై 5 ఆదివారం బాపట్ల మున్సిపల్ కార్యాలయము నందు జరగనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా హాట్-హాక్ కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కార్యవర్గం పదవీ కాలం ముగియటంతో ప్రస్తుతం ఎన్నికలు అనివార్యం అయినట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించామని ఇ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా కె రోషయ్య , అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్గా రాజేష్ బాబు వ్యవహరిస్తారని తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్..

5 ఆదివారం 9 నుండి 11 వరకు నామినేషన్ల స్వీకరణ. 11నుండి 12 వరకు నామినేషన్ వెరిఫికేషన్, మధ్యాహ్నం 1 వరకు ఉపసంహరణ. సాయంత్రం 1నుండి 2వరకు పోలింగ్ అదే రోజు కౌంటింగ్, గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించనున్నరని తెలిపారు. సదరు ఎన్నికల్లో బాపట్ల తాలూకా ప్రభుత్వ ఉద్యోగులు అందరూ పాల్గొనాలని జివివి రాఘవరెడ్డి కోరారు.

## రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు పంపిణీ

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 2)**

రీ సర్వే పూర్తి అయిన మోటుపల్లి గ్రామానికి చెందిన రైతులకు గురువారం మోటుపల్లి సచివాలయ కార్యాలయంలో పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసినట్లు మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ 157 రైతులకు పట్టాదార్ పాసు పుస్తకాలు పంపిణీ నిర్వహించినట్లు తెలిపారు. సదరు కార్యక్రమం శుక్ర, శనివారం కుడా గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె ప్రభాకరరావు, డిటి సుజాత, వీఅర్ఓ నాగరాజు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 2)**

చిడిపోతు మాధవ, రజిని దంపతుల కుమారుడు నరసింహనాయుడు, బుజ్జి వివాహ వేడుక గురువారం వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. నూతన దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. పెళ్లి వేడుకల్లో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు అత్తంటి శ్రీహరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసిన అనంతరమే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి

**ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఎర్రయ్య**



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 2)**

2025 ఉపాధ్యాయుల బదిలీల్లో రిలీవర్ లేక విధుల్లో చేరలేకపోతున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం తక్షణమే రిలీవ్ చేసి, వారి స్థానాల్లో సర్‌ప్లస్ ఉపాధ్యాయులను నియమించిన అనంతరమే సర్దుబాటు (అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌టీయూ తర్లుపాడు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు, మీర్జాపేట, గొల్లపల్లి, తాడివారిపల్లి, రోలుగుంపాడు, నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు తదితర గ్రామాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అలాగే, రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని జిఓ నెం 53 ప్రకారం వెంటనే అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగుల కోసం తక్షణమే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి, మధ్యంతర ఉపశమనం (ఐఆర్)గా 30 శాతం ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ తర్లుపాడు మండల శాఖ అధ్యక్షులు కె జగన్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె నజీర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ జ్యోతి, జిల్లా కౌన్సిలర్ బొప్పరాజు శ్రీనివాసులు, హనుమంతరావు, మండల శాఖ ఉపాధ్యక్షులు వై రంగస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల దత్తత విషయం పెండింగ్ లేకుండా చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 2)**

పిల్లల దత్తత విషయం పెండింగ్ లేకుండా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. గురువారం డిసిపియు విభాగం పై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా శిశుగృహాలోని పిల్లల దత్తత విషయం పెండింగ్ లేకుండా చేయాలన్నారు. సిడబ్ల్యూసీ వారితో సంప్రదించి పిల్లల దత్తత ప్రక్రయ పూర్తి చేయాలని సూచించారు. అలాగే బాలసదనంలోని, స్వచ్ఛంద సంస్థలలోని పిల్లలకు ఆధార్ పెండింగ్ లేకుండా చూడాలని, అలాగే వారిని స్వచ్ఛంద సంస్థల్లో లేకుండా స్కూల్‌కి వెళ్లేలా చూడాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ పిల్లలు లేకుండా చూడాలని వారిని స్కూల్లో చేర్పించాలని అలాగే పోక్సో పిల్లలకు త్వరగా న్యాయం జరిగేలాగా చూడాలని మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా భాదిత పిల్లలకు త్వరగగతిన న్యాయం చేయాలని సూచించారు. డిసిపియు విభాగంలోని ప్రొడక్షన్ ఆఫీసర్స్ వారి విధులను పెండింగ్ లేకుండా చూడాలని అలాగే వారి యొక్క విధులలో నిర్లక్ష్యం వహిస్తే తక్షణం విధుల నుండి తొలగిస్తానని హెచ్చరించారు. లైన్ డిపార్టుమెంటుతో సహకరించుకుంటు భాదిత పిల్లలకు త్వరగా న్యాయం చేయవలసిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్, డిసిపి విభాగంలోని పిఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ విగ్రహం ధ్వంసం పై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం





**జమ్మలమడుగులో భారీ ర్యాలీ**
**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 2)**

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం దేవగుడి గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దుశ్చర్యపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ జమ్మలమడుగు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. విగ్రహ ధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తూ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ర్యాలీగా బయలుదేరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ మంత్రి పొన్నపురెడ్డి మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష రామసుబ్బారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ ఎమ్మెల్యేలు రాజమౌళి, శివప్రసాద్ రెడ్డి, రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి పోరెడ్డి నరసింహారెడ్డి తదితర ముఖ్య నాయకులు జమ్మలమడుగు పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గారిని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాష్ట్రానికి ఎనలేని సేవలు చేసిన మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన ఆ గుర్తు తెలియని వ్యక్తులను వెంటనే గుర్తించి, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.





## కడవకుదురులో ఒక నెల- ఒక నేల- నాలుగు సందర్శనలు




**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 2)**
రైతుల భూ సమస్యల పరిష్కరించడానికి ప్రభుత్వం చేపట్టిన ఒక నెల–ఒక నేల–నాలుగు సందర్శనలు కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు అన్నారు. గురువారం మండలంలోని కడవకుదురు గ్రామంలో తహశీల్దార్ అధ్వర్యంలో ఒక నెల–ఒక నేల–నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతుల నుండి 7అర్జీలు తహశీల్దార్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రభాకరరావు, విఅర్ఓ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కడప జిల్లా కమిటీని సత్కరించిన బైసాని కార్తిక్





**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జులై 2)**
కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులుగా నియమితులైన వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ సి,వి నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్‌జట గురువారం సాయంత్రం స్థానిక నెల్లూరు రోడ్ లోని ప్రజా మార్పు పత్రిక జిల్లా ఇంచార్జ్ బైసాని కార్తీక్, మహాలక్ష్మి దేవాలయం సెక్రటరీ కొలిశెట్టి రమేష్, చల్లగుండ్ల సునీల్ కుమార్ జిల్లా కమిటీ వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో మరెన్నో పదవులు అలంకరించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పబ్బతి చక్రపాణి, సాయి సుమంత్ పాల్గొన్నారు.

## మొహరం సంబరాల్లో మెప్పించిన యువకులకు బహుమతుల పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 2)**
మొహరం పండుగ వేడుకల్లో వేషధారణలు గావించి ప్రజలను మెప్పించిన పలువురికి గురువారం బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొహరం పండుగను పురస్కరించుకొని పీర్లను నిలబెట్టిన రోజున పుల్లలచెరువుకు చెందిన పలువురు యువకులు వేషధారణలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారికి పుల్లలచెరువుకు చెందిన పెద్దలు గురువారం బహుమతులను పంపిణీ చేయడం జరిగింది. అలాగే ప్రతి సంవత్సరం యువకులు మొహర్రం వేడుకల్లో విశేష సంఖ్యలో పాల్గొని, చిత్ర విచిత్ర వేషధారణలతో ప్రజలను అలరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్లకుంట జానకి రఘు, గోపవరపు గురునాథం, కొత్త చిన్న, షేక్ బాజీ, దూదేకుల కాశింవలి, తదితరులు పాల్గొన్నారు.

# జబ్బులు ప్రజలకి... డబ్బులు గోతాలు జగన్ ఇంటికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 2)**
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ అమలు చేసిన మద్యం విధానంలో "జబ్బులు ప్రజలకి... డబ్బులు గోతాలు జగన్ ఇంటికి" వెళ్ళాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై దాదాపు రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని, అనేక శాఖల ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు చెల్లించలేకపోయిందని, పెన్షన్లు కూడా సకాలంలో ఇవ్వలేని పరిస్థితిని తీసుకొచ్చిందని ఆరోపించారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, సామాజిక పెన్షన్లను భారీగా పెంచడం, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచడం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయని వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలను ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా చేసిందని విమర్శించారు.
అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అప్పుల భారం ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని, ఈ నెల 16 నుంచి 18వ తేదీ మధ్య 'తల్లికి వందనం' పథకం నిధులను అర్హుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.








# వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 2)**
వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం విజయవాడ నుండి 'ఎస్ఐఆర్' నిర్వహణ, సన్నాహక చర్యలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రొద్దుటూరు తహశీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరవగా.. కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి డిఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

**76.24 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి**
కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 18,96,231 మంది ఓటర్లలో ఇప్పటివరకు 14,45,697 మంది (76.24 శాతం) మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు. ఇంకా 4,50,534 మంది ఓటర్ల మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందని, అలాగే మొత్తం 4,62,016 మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలను గుర్తించినట్లు వెల్లడించారు.

**డిజిటైజేషన్ పై ప్రత్యేక నిఘా...** జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.17 శాతం పూర్తయినప్పటికీ, ఫారాల డిజిటైజేషన్ కేవలం 30.80 శాతమే నమోదు కావడంపై కలెక్టర్ స్పందించారు. డిజిటైజేషన్‌లో వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలోని 321 పోలింగ్ కేంద్రాల్లో డిజిటైజేషన్ 15 శాతం కంటే తక్కువగా ఉందని, అక్కడ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

**త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం..** 2,444కు పెరగనున్న పోలింగ్ కేంద్రాలు
బుక్ ఏ కాల్స్ ద్వారా వచ్చిన 4,338 ఫిర్యాదుల్లో ఇప్పటికే 4,029 ఫిర్యాదులను పరిష్కరించామని, మిగిలిన కొద్దిపాటి పెండింగ్ సమస్యలను త్వరలోనే క్లియర్ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గం నుండి వచ్చిన ఒక ప్రతికూల వార్త పై విచారణ జరపగా, అందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని తేలిందన్నారు.

**పోలింగ్ కేంద్రాల పెంపు :** పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా జిల్లాలో ఓటర్ల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న 2,251 పోలింగ్ కేంద్రాలను 2,444కు పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వివరించారు.




## వీబీజీ రామ్ జీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
### ఎంపీడీవో మరియదాస్



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 2)**
వీబీజీ రామ్ జీ (ఉపాధి హామీ) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పుల్లలచెరువు ఎంపీడీఓ మరియదాసు కోరారు. గురువారం మండలంలోని సుద్దకురవ తండాలో వీబీజీ రామ్ జీ పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంతల తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మరియదాసు మాట్లాడుతూ గతంలో 100 రోజులుగా ఉన్న ఉపాధి హామీ పనిదినాలను ప్రస్తుతం 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. అలాగే కూలీల దినసరి వేతనాన్ని రూ.307 నుంచి రూ.312కు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం కింద 4 ప్రధాన కేటగిరీలలో మొత్తం 318 రకాల అభివృద్ధి పనులను చేపట్టే అవకాశం ఉందని వివరించారు. జల సంరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, విపత్తుల నిర్వహణ వంటి విభాగాల్లో వివిధ పనులు చేపట్టి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కూలీ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధితో పాటు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, సీనియర్ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, ఏపీవో మోషే, ఉపాధి హామీ పథకం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూలు ఆకస్మిక తనిఖీ




**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 2)**
మండలంలోని చిన్నగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి ఆవుల సాంబశివరావు మరియు ఏఏఎంఓ షేక్ ఖాసింలు పీఎం శ్రీ స్కూల్స్ విజిట్‌లో భాగంగా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సైన్స్ ల్యాబ్స్ ,స్టెమ్ ల్యాబ్, పాల్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్, పీఎం శ్రీ కి సంబంధించిన మెటీరియల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్స్ వాడకం మరియు విద్యార్థులకు వివరణాత్మక మెటీరియల్ అందించాలని సూచన ఇచ్చారు. అనంతరం జిల్లా సైన్స్ ఆఫీసర్ సాదిక్ పీఎం శ్రీ స్కూల్ ని విజిట్ చేసి సైన్స్ ఉపాధ్యాయులకు తగిన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి,నరసింహారావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మాదిగల భూమి కబ్జా చేసిన వైసిపి రెడ్లను అరెస్టు చేయని దర్శి డిఎస్పి

### ల్యాండ్ గ్రాబింగ్ కింద అరెస్టు చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు
### దర్శి డిఎస్పి పై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
### ల్యాండ్ గ్రాబింగ్ కింద బొగ్గుల రెడ్ల ముఠాను అరెస్టు చేయాలని నీలం నాగేంద్ర డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 2)**

మాదిగల పట్టా భూమిని ఆక్రమించి శాశ్వత అక్రమ కట్టడాలు నిర్మించిన వైసిపి నేత బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి ముఠాను ల్యాండ్ గ్రాబింగ్ చట్టప్రకారం అరెస్టు చేయాలని దర్శి డిఎస్పి బాలమురళి కృష్ణను దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం అద్దంకిలో అంబేద్కర్ భవన్లో జరిగిన నిరసన కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడారు. తాళ్లూరు మండలం శివరాంపురం గ్రామానికి చెందిన అనుపర్తి షెడ్రక్ అను మాదిగ కులానికి చెందిన వ్యక్తికి సర్వేనెంబర్ 83/1లో గల 52 సెంట్లు భూమిలో 26 సెంట్లు ఆక్రమించుకున్నాడన్నారు. హద్దులు మార్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ 52 సెంట్ల భూమిలో వేల్లంపల్లి నుండి తాళ్లూరు వచ్చే రహదారి పక్కనే గల 26 సెంట్లు భూమిని అక్రమంగా మోసపూరితంగా దొంగ రిజిస్ట్రేషన్ చేసుకుని వే బ్రిడ్జి, డైరీ ఫార్మ్ నిర్మించాడన్నారు. చాలాకాలంగా బాధితులు రెవెన్యూ పోలీస్ కార్యాలయాలా చుట్టూ తిరిగిన ఎవరు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో మరలా ప్రకాశం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు కూడా ప్రజా ఫిర్యా దుల విభాగంలో ఫిర్యాదు చేసిన స్పందించలేదన్నారు.




ఎట్టకేలకు గత నెల 17వ తేదీన తాళ్లూరు పోలీస్ స్టేషన్లో అనపర్తి షడ్రక్ భార్య సమాధానం ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 44/26 మొక్కుబడిగా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులో కూడా ఎస్సీల భూమిని ఇతర కులాలవారు ఆక్రమిస్తే ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌లోని సెక్షన్ ఎఫ్, జి వర్తిస్తాయి కానీ తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జున్ ఉద్దేశపూర్వకంగా సంబంధిత సెక్షన్లు వేయలేదన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసును విచారించిన దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ ల్యాండ్ గ్రాబింగ్‌గా మారుస్తూ ఆల్టర్ మెమో వేయలేదన్నారు. వైసిపి నేత బొగ్గుల శ్రీనివాసరెడ్డి అతని భార్య నాగమణి, కొడుకు సమరసింహారెడ్డి అలాగే భూమి రికార్డు తారుమారు చేయటానికి అక్రమ కట్టడానికి అక్రమ రిజిస్ట్రేషన్ కు కుట్ర పూర్వకంగా సహకరించిన వెన్నపూస ఆదిలక్ష్మి, వెన్నపూస పేరు రెడ్డి తదితరులు అందరును ల్యాండ్ గ్రాబింగు చీటింగ్ ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం వెంటనే అరెస్టు చేయకుండా దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ వైసిపి భూ ఆక్రమణ బొగ్గుల రెడ్ల ముఠాకు గొడుగు పడుతున్నాడని నీలం నాగేంద్రరావు ఆరోపించారు. ఆదివారం లోపు మాదిగల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని మాదిగలను మోసం చేసి కుట్ర పూర్వకంగా అనపర్తి షడ్రక్ స్థలంలో శాశ్వత కట్టడాలైన వే బ్రిడ్జి మరియు మిల్క్ డైరీ ఫామ్ నిర్మించిన వైసీపీ నేత బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, అరెస్టు చేయకుంటే సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని నీలం తెలిపారు అనపర్తి షెడ్రక్ భూమిని ఆక్రమించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొని శాశ్వత కట్టడాలు నిర్మించిన బొగ్గుల శ్రీనివాసరెడ్డి ముఠాపై జిల్లా కలెక్టర్‌కు , జిల్లా ఎస్పీకి ఇప్పటికే ఫిర్యాదు చేశామని నీలం తెలిపారు. మాదిగల భూమిని ఆక్రమించిన వైసీపీ నేత బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి ముఠాను అరెస్టు చేయకుంటే దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ పై జాతీయ ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని దళిత నేత నీలం తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, ఆ మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ బంగారం, ఎర్రమల శ్రీను, బాధితులు షడ్రక్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడి పని చేశాను జిల్లా కమిటీలో అవకాశం కల్పించండి

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 2)**



జనసేన పార్టీ త్వరలో నియమించబోయే పార్టీ కమిటీల్లో భాగంగా జిల్లా కమిటీలో తనకు అవకాశం కల్పించాలని మండల జనసేన పార్టీ తాజా మాజీ అధ్యక్షులు కొఠారి అచ్చయ్య కోరారు. యర్రగొండపాలెం అంబేద్కర్ ఆడిటోరియంలో జనసేన పార్టీ ప్రకాశం జిల్లా సమన్వయకర్త కిలారు రోశయ్య ఆధ్వర్యంలో పార్టీ సమాచార సేకరణ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అచ్చయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ మండల అధ్యక్షులుగా ఇప్పటివరకు (4 సంవత్సరాలు) అవకాశం కల్పించిన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికై కృషి చేసినట్లు తెలిపారు. త్వరలో నియమించబోయే జిల్లా కమిటీ లో తనకు అవకాశం కల్పించాలని అచ్చయ్య సమన్వయకర్త కిలారు రోశయ్యకు విన్నవించుకున్నారు. పార్టీలో తనకు ఏ పదవి ఇచ్చినా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని, పార్టీ అభివృద్ధికై ఎల్లవేళలా కృషి చేస్తానని ఈ సందర్భంగా అచ్చయ్య తెలియజేశారు.

## బ్రహ్మంగారి మఠం నూతన మేనేజర్ పిపిఎన్ ప్రసాద్‌కి ఘన సన్మానం



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 2)**

బ్రహ్మంగారి మఠం నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పిపిఎన్ ప్రసాద్ ని ఆర్యవైశ్య సభ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. గురువారం మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మంగారి మఠంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్‌బాబు, నూతన మేనేజర్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పిపిఎన్ ప్రసాద్ తన నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని, మఠం అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ప్రతినిధులు అయిన అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు, ఉపాధ్యక్షులు సుంకు చిన్న సిద్ధయ్య, కార్యదర్శి సుంకు సురేష్ బాబు, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, ఉప కోశాధికారి పబ్బతి నాగేశ్వరరావు, యువజన సంఘం అధ్యక్షులు యాదాల వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరూ నూతన మేనేజర్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ వారి పదవీకాలం దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు.

## ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 2)**

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. ఈ ప్రక్రియలో లో పర్సెంట్ లో ఉన్న ఎర్రగొండపాలెం నియోజకవర్గం లోని తహసీల్దార్‌లు, సూపర్ వైజర్లతో స్థానిక కలెక్టరేట్లో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదేపదే చెబుతున్న ఈ ప్రక్రియలో కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఇక నుంచి ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. చనిపోయిన వారి పేర్లు తొలగించి అర్హులైన అందరితో సమగ్ర జాబితాలు తయారు చేయాలన్నారు. ఇక నుంచి ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## దేవగుడిలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం దుర్మార్గం

### శెట్టిపల్లి రఘురామిరెడ్డి తీవ్ర ఖండన



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 2)**

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, దేవగుడి గ్రామంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారి పై పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన పై ఆయన మైదుకూరులో ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న ఒక మహోన్నత నాయకుడి విగ్రహాన్ని రాజకీయ కక్షలతో, ద్వేషంతో ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని మండిపడ్డారు. వైఎస్సార్ అంటే కేవలం ఒక విగ్రహం కాదు.. కోట్ల మంది పేదల గుండె చప్పుడు. విగ్రహాలు కూల్చినంత మాత్రాన ప్రజల హృదయాల నుంచి ఆయన జ్ఞాపకాలను, ఆయన చేసిన సంక్షేమ పథకాలను ఎవరూ చెరిపివేయలేరన్నారు. దేవగుడి గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను, వారి వెనుక ఉన్న సూత్రధారులను పోలీసులు వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలన్నారు. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను, వారి వెనుక ఉన్న సూత్రధారులను పోలీసులు వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఇటువంటి ఉద్రిక్తతలకు తావిచ్చే దుశ్చర్యలు పునరావృతం కాకుండా శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. రాజకీయాల్లో ఇటువంటి కక్షసాధింపు సంస్కృతి మంచిది కాదని, ప్రజాస్వామ్యవాదులంతా ఈ ఘాతుకాన్ని తప్పుపట్టాలని రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడకుండా, శాంతియుతంగా నిరసన తెలపాలని ఆయన కోరారు.

## పేదల ఆరోగ్యానికి భరోసా ఎమ్మెల్యే ఏలూరి కృషితో ముగ్గురికి ఎల్ఓసీలు

### రూ.3.09 లక్షల ఎల్ఓసీలు అందజేత



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 2)**

నియోజకవర్గంలోని పేద రోగులకు ఆర్థిక భరోసా కల్పించేలా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఆయన ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ముగ్గురు రోగులకు మొత్తం రూ.3,09,486 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ)లు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

ముగ్గురు రోగులకు....మార్టూరు మండలం రాజుపాలెం(ఆర్)కు చెందిన దామవరపు అనిల్ కుమార్‌కు రూ.1,83,077 మంజూరు కాగా, గుంటూరులోని వికాస్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందేందుకు ఈ మొత్తాన్ని కేటాయించారు. మార్టూరు మండలం కొల్లలపూడికి చెందిన మురికిపూడి వెంకట వైష్ణవికి రూ.50 వేలు మంజూరు కాగా, ఒంగోలులోని కిమ్స్ కృష్ణా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స అందించనున్నారు. యద్దనపూడి, గన్నవరం కు చెందిన దుల్లిపల్ల రఘుబాబుకు రూ.76,409 మంజూరు కాగా, చిలకలూరిపేటలోని ఆర్‌కే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యం అందించనున్నారు.

ఎమ్మెల్యే లేఖలతో...ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వయంగా సంబంధిత రోగుల వివరాలతో ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖల ఆధారంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఈ మూడు ఎల్వోసీలను మంజూరు చేశారు.

పేదలకు అండగా ఎమ్మెల్యే...నియోజకవర్గంలో ఆర్థిక స్తోమత లేక చికిత్స చేయించుకోలేని పేద రోగుల పక్షాన నిలుస్తూ, వారికి సీఎంఆర్ఎఫ్ సాయం అందేలా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ మూడు కేసుల్లోనూ ఆయన వ్యక్తిగత చొరవతోనే సకాలంలో ఆర్థిక సాయం మంజూరు కావడంపై సంబంధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయా చెక్కులను స్థానిక నేతలు బాధితులకు అందజేశారు.

## అభివృద్ధి లక్ష్యంగా విబిజీ రామ్ జీ కార్యక్రమానికి శ్రీకారం

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 2)**

భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 125 రోజుల "వికసిత భారత్–జీ రామ్‌జీ" కార్యక్రమాన్ని పుల్లలచెరువు మండలంలోని ఐటి వరం గ్రామ పంచాయతీలో గురువారం ఘనంగా ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఐటి వరం గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పై అవగాహన కల్పించారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పుల్లలచెరువు మండల టీడీపీ కన్వీనర్ పోట్ల గోవింద మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పావులూరి మన్నేయ్య, గద్దె మల్లయ్య, ఎఫ్ ఏ సూరాబత్తిని రాముడు, సోమెపల్లి కోటయ్య, సోమేపల్లి సుబ్బారావు, శీలం కోటేష్, టీప వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.




